క్లుప్తంగా

శ్రీదేవి శరన్నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు


హ్రీం పీఠంలో వివరాలు వెల్లడిస్తున్న ఈశ్వర్‌నాథ్

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని ఏపీ ఎస్పీ వద్ద హ్రీం పీఠంలో శ్రీదేవి శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు ఈశ్వర్‌నాథ్ తెలిపారు. పీఠంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 22 నుంచి అక్టోబర్ 2 వరకూ దేవీ నవరాత్రులు జరుగుతాయన్నారు. ఆయా రోజుల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, హోమం చేస్తామన్నారు. పీఠంలోని వారాహి, లలితా, రాజశ్యామల అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తామన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా కృష్ణగోపాల్


ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణగోపాల్‌ను అభినందిస్తున్న అధికారులు, నాయకులు

కరప: స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓగా బి.కృష్ణగోపాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఎంపీడీఓగా పనిచేసిన మట్టపర్తి అనుపమకు డీఎల్‌డీఓగా పదోన్నతి లభించగా ఏలూరు జిల్లా విజిలెన్స్ అధికారిణిగా వెళ్లారు. కాగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు నుంచి కాకినాడ రూరల్ ఎంపీడీఓ కృష్ణగోపాల్ కరప మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా కృష్ణగోపాల్ చార్జి తీసుకున్నారు. ఆయనకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, ఏఓ బీఎల్ నరసింహం, టి.సుబ్రహ్మణ్యం, కార్తీక్, రామలక్ష్మి, ఉపాధి పథకం జేఈ సంగీతలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు తదితరులు అభినందనలు తెలిపారు.

వాహన మిత్ర నమోదుకు గడువు పెంచాలి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వాహనమిత్ర పథకంలో నమోదుకు గడువు మరో వారం రోజులు పెంచాలని సీఐటీయూ నాయకులు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో, క్యాబ్ వాహనదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయం కోసం నమోదుకు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ సమయం ఇచ్చిందన్నారు. సచివాలయాల్లో కొన్ని సందర్భాల్లో సర్వర్లు పనిచేయక పోవడంతో నమోదు ప్రక్రియ ఆలస్యం అయ్యిందన్నారు. ఒకరి వాహనం మరొకరు కొనుగోలు చేసినప్పుడు రికార్డు ట్రాన్స్‌ఫర్‌కు కూడా సర్వర్లు పనిచేయని సందర్భంలో జాప్యం జరిగిందన్నారు. వాహనమిత్ర పథకాన్ని వాహన యజమానులతో పాటు ఆటో, క్యాబ్ వాహనాలపై ఆధారపడే డ్రైవర్లకు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

పార్కు స్థలంలో ఆక్రమణపై ఫిర్యాదు

కాకినాడ రూరల్: కొవ్వూరులోని తారకరామ నగర్‌ను ఆనుకుని మణికంఠనగర్‌లో పంచాయతీ అనుమతి పొందిన లేఅవుట్‌లోని సామాజిక స్థలం (పార్కు)లో అక్రమ నిర్మాణం చేపట్టారని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి పాలకవర్గం ఫిర్యాదు చేసింది. సర్పంచ్ పిల్లి చక్రరావు, ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మికి ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోని కూటమి నాయకుడు పంచాయతీ స్థలంలో నిర్మాణం చేపడుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు.

ప్రధాని మోదీ జీవితం అందరికీ ఆదర్శం

బోట్‌క్లబ్: ప్రధాని మోదీ జీవితం అందరికీ ఆదర్శం కావాలని బీజేపీ నాయకుడు పైడా భవనప్రసాద్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సేవా సప్తాహంలో భాగంగా శుక్రవారం స్థానిక మల్టీప్లెక్స్ థియేటర్‌లో మోదీ బాల్యం కథగా నిర్మించిన డాక్యుమెంటరీని బీజేపీ నాయకులు, విద్యార్థులు వీక్షించారు. మోదీ తీసుకొచ్చిన ఉజ్వల యోజన, ముద్ర యోజన వంటి అనేక పథకాలపై వివరించారు. బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షురాలు గోడి సత్యవతి, గీతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ సురభిశారద, నాయకులు చోడిశెట్టి రమేష్, జ్యోతుల రాజేష్ పాల్గొన్నారు.

కాలువ వరపాట్లు

- అధ్వానంగా చీడీలపొర డ్రైనేజీ
- ఎక్కడికక్కడే పూడికలు
- పలుచోట్ల శిథిలావస్థలు


కాలువ గోడపై మొక్కలు రావడంతో శిథిలమవుతున్న వైనం


చెత్తా చెదారంతో నిండిన కాలువ

కాకినాడ లీగల్: మురుగు పోయే ప్రధాన కాలువ అది.. నగరంలో జనావాసాలకు చెందిన మురుగు నీరంతా చీడీలపొర డ్రైనేజీ నుంచే వెళ్లాల్సి ఉంది. అయితే ఇది ఎక్కడికక్కడే పూడికతో నిండి, పలుచోట్ల శిథిలమై దర్శనమిస్తోంది. ఈ చీడీలపొర డ్రైనేజీలో పూడికను ఏడాదికి ఒకసారి మాత్రమే తీయడంతో స్థానికులు ఇబ్బందుల పాలవుతున్నారు. డ్రైనేజీ నిర్వహణ లేక గోడలపై మొక్కలు పెరిగిపోతున్నాయి. దీనివల్ల డ్రైనేజీ కట్టడం బీటలు వారుతోంది. చుట్టుపక్కల ప్రజలు చెత్తను ఇక్కడే పడేస్తున్నారు. కాలువలో చెత్త పేరుకుపోయి మురుగునీరు ముందుకు పారడం కష్టమవుతోంది. ఫలితంగా డ్రైనేజీ నుంచి దుర్వాసన వస్తోంది. ఇది ఈగలు, దోమలు, విష కీటకాలకు ఆవాసంగా మారుతోంది. ఇలా ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు.

ఎలా కలుస్తుందంటే..

స్థానిక అశోక్‌నగర్ నుంచి ఇంద్రపాలెం కాలువకు అనుసంధానం చేస్తూ చీడీలపొర డ్రైనేజీ నిర్మించారు. అశోక్‌నగర్ నుంచి శారదాంబగుడి, గాంధీనగర్, రామారావుపేట ప్రాంతాల మీదుగా ఇంద్రపాలెం ఉప్పుటేరులో ఈ డ్రైనేజీ కలిసేలా నిర్మించారు. అక్కడి నుంచి నీరు సముద్రంలో కలుస్తుంది. ఈ డ్రైనేజీ సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో ఉంటుంది. నగరంలో మురుగునీరు అంతా ఉప్పుటేరులో కలిసేలా నిర్మించారు. అయితే లక్ష్యానికి గండి పడుతోంది. ఈ డ్రైనేజీని ఆనుకుని ప్రజలు నివాసాలు ఏర్పరచుకున్నారు. ప్రతి రోజూ స్థానికులు ఇళ్లలో ఉపయోగించే చెత్తాచెదారంతో పాటు, పశు యజమానులు పెంట, పేడ వేస్తున్నారు. ఇళ్లకు వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్త ఇవ్వకుండా డ్రైనేజీలో వేయడంతో మురుగునీరు పారడం లేదు. ఎక్కడికక్కడే చెత్త తిష్ట వేస్తుంది. డ్రైనేజీలో నీరు ముందుకు ప్రవహించకపోవడంతో ఈ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. స్థానిక ప్రజలతో పాటు అటుగా వెళ్లే ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరిగిపోతున్నాయి. అవి రాత్రి, పగలు అనేక తేడా లేకుండా స్థానికులపై దాడి చేస్తున్నాయి. ఇలా ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. దోమలతో డెంగీ, మలేరియా వంటి జ్వరాలు విజృంభిస్తున్నాయి. చీడీలపొర డ్రైనేజీని శుభ్రపరిచి, చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో పూడిక తొలగించాలి



చీడీలపొర డ్రైనేజీలో నెల రోజులకు ఒకసారైనా పూడిక తొలగించాలి. కాలువలో చెత్తాచెదారం, మురుగు పేరుకుపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయి. స్థానికంగా నివాసం ఉండే ప్రజలు, చిన్నారులు దోమలతో ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగును తొలగించాలి.

–కె.గోపాలకృష్ణ, స్థానికుడు

అధికారులు స్పందించాలి



డ్రైనేజీ గోడలపై అడ్డదిడ్డంగా పెరిగిపోయిన మొక్కలను తొలగించాలి. మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో డ్రైనేజీ శిథిలమవుతుంది. ఆయా చోట్ల మరమ్మతులు చేయించకపోతే మరింత పాడవుతాయి. వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

–కె.దుర్గాప్రసాద్, స్థానికుడు

బీచ్‌లో నేడు శుభ్రతా కార్యక్రమం

కాకినాడ రూరల్: ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డేను పురస్కరించుకుని సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో పరిశుభ్రతా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు కోస్ట్‌గార్డ్ స్టేషన్ కమాండెంట్ ఏబీ రామం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10.30 గంటల వరకూ బీచ్‌లో పరిశుభ్రతా కార్యక్రమం చేపడతామన్నారు. సముద్ర తీరంలోని వ్యర్థాలు తొలగించేందుకు స్వచ్ఛంద సేవకులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాలుపంచుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక పార్కుగా అభివృద్ధి చేయాలి

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి శివాలయం కోనేరు ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక పార్కుగా అభివృద్ధి చేయాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దూసర్లపూడి రమణరాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గత ఏడాది ఆలయంలో జరిగిన సమావేశంలో కోనేరు ఆవరణలో నలువైపులా ఆధ్యాత్మిక పార్కుగా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకూ నగరపాలక సంస్థ, దేవదాయ శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. 2018లో హోమం చేయించి కోనేరు చుట్టూ అమ్మవారి 8 రాతి విగ్రహాలు ప్రతిష్ఠ చేసినందున వాటికి వైదిక ఆగమ పూజలు నిర్వహించాలన్నారు. గత ఏడాది నైరుతిలోని నాగశివలింగం అపహరణకు గురైందన్నారు. రాత్రి వేళలో ఈ ప్రాంతం మందుబాబులకు నిలయమైందన్నారు. దేవతా రాతి విగ్రహాలను దేవదాయ శాఖ గాలికి వదిలేయడం తగదన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి


కొంగోడులో ఎస్‌డబ్ల్యూఎస్ కేంద్రం పనితీరును పరిశీలిస్తున్న సీఈఓ లక్ష్మణరావు

కరప: గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి రోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం డీపీఓ నడకుదురు గ్రామంలో, సీఈఓ కొంగోడులో పర్యటించి పారిశుధ్య పనులు నిర్వహణను తనిఖీ చేశారు. పంచాయతీ సిబ్బందికి, కార్యదర్శులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులను కలసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి తడి, పొడి చెత్త తీసుకువెళుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువును ఎలా తయారు చేస్తారో వివరించారు. కంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రామ పంచాయతీల్లో తక్కువ ధరకు లభించే కంపోస్టు ఎరువుతో గృహాల్లో పూల మొక్కలు పెంచుకోవడానికి, కూరగాయలు పండించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు వెళ్లి, వాటి నిర్వహణను డీపీఓ రవికుమార్ పరిశీలించారు. స్వర్ణ పంచాయతీలో సామిత్వ సర్వే తదితర అంశాల పనితీరును అధికారులు పరిశీలించి, అనుసరించాల్సిన విధి విధానాలపై సూచనలిచ్చారు. రోజూ గ్రామ కార్యదర్శులు పంచాయతీ యాప్‌లో లాగిన్ అయి నిర్వహిస్తున్న కార్యకలాపాలను అప్‌లోడ్ చేయాలన్నారు. మొబైల్ యాప్‌లో గ్రామ పంచాయతీల పనితీరును డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు డీపీఓ, సీఈఓలకు వివరించారు. కార్యదర్శులు కె.వారిజ, జి.దుర్గాప్రసాద్, పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


చిరు ధాన్యాలతో చేసిన వివిధ ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కాకినాడ క్రైం: స్థానిక జెట్ల పెదకాపు వీధిలోని యూపీహెచ్‌సీలో శుక్రవారం పోషణ్ మా, నారీ స్వస్థ్ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు సంయుక్తంగా నిర్వహించారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అర్చన, కాకినాడ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ చెరుకూరి లక్ష్మి హాజరయ్యారు. పిల్లలకు అందించాల్సిన పోషకాహారంపై తండ్రులకు అవగాహన కల్పించారు. కొని తెచ్చే ఆహార పదార్థాలు నూనె, పంచదార, మైదాతో చేసినవి కాకుండా చూసుకోవాలన్నారు. చిరుధాన్యాలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో చేసిన సంప్రదాయ ఆహార పదార్థాలు విభిన్న రూపాల్లో అందిస్తే పిల్లలు తినేందుకు ఆసక్తి చూపుతారని అన్నారు. అంగన్‌వాడీలు ప్రదర్శించిన చిరు ధాన్యాల ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ అరుణ ఆదేశాల మేరకు, నారీ స్వస్థ్ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ అర్చన ఆధ్వర్యంలో గర్భిణులకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేశారు. మరో 50 మంది మహిళలకు క్యాన్సర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. సంయుక్త కార్యక్రమాల్లో 48, 49, 50 వార్డులకు చెందిన ప్రజాప్రతినిధులు, సూపర్‌వైజర్ అరుణ దుర్గాంబ, వైద్యులు మేఘన, రేఖాదేవి, దేవిక, హెల్త్ అసిస్టెంట్ బుజ్జి, నర్సింగ్ ఆఫీసర్ లింగేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులు అద్భుతాలు సృష్టించాలి


శ్యామ్‌ను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: నేటి విద్యా విధానాన్ని సకాలంలో వినియోగించుకోవడం ద్వారా అద్భుతాలను సృష్టించడానికి విద్యార్థులకు ఎంతో వీలుంటుందని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత జి శ్యామ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశం క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. విద్యా పోకడలు, పరిణామాలు అనే అంశంపై శ్యామ్ ప్రసంగించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే ప్రస్తుత విద్యా విధానంలో అందుబాటులో ఉన్న అన్ని విషయాలను గ్రహించాలన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంచడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమశిక్షణ నేర్పించాలని అన్నారు. అనంతరం శ్యామ్‌ను రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ప్రవీణ్ సాన, కోశాధికారి ఉదయ చక్రవర్తి, ముత్తా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల ఆకస్మిక మార్పు తగదు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవిజయ్

బాలాజీచెరువు: క్యాలెండర్ ప్రకారం ఖరారు చేసిన దసరా సెలవులను ఒక్కరోజు ముందు మార్పు చేయడం వల్ల అకడమిక్ క్రమశిక్షణ దెబ్బతింటుందని ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఫెడరేషన్ ఫౌండర్ ఎం.శ్రీవిజయ్ అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని ఎంఎస్ఎన్ పాఠశాలలో జరిగిన ప్రైవేట్ విద్యా సంస్థల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా సెలవుల విషయంలో ప్రభుత్వ మార్పు సరికాదన్నారు. దీనివల్ల షెడ్యూల్ మారుతుందని, తద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఇచ్చే అకడమిక్ క్యాలెండర్‌పై నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. విద్యా శాఖ విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంలో దృష్టి సారించాలని, సెలవుల కంటే ఇతర అంశాలపై పురోగతి సాధించాలని సూచించారు.

కోనేటి కష్టాలు

- పాదగయలో పుణ్య స్నానాలకు ఇబ్బంది
- కలుషితమైన పుష్కరిణి
- ముందు జాగ్రత్త చర్యల్లో అధికారులు విఫలం


పుష్కరిణిలో పిండాలు వదులుతున్న భక్తుడు


దుర్గంధభరితంగా మారిన పాదగయ పుష్కరిణి

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో పుణ్య స్నానాలకు భక్తులు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. ఇక పర్వదినాల్లో వేలాది మంది తరలి వస్తుంటారు. అలాంటి పుణ్య స్నానాలకు ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల సమయంలో ఆటంకం ఏర్పడుతున్నా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠం పిఠాపురం పాదగయ క్షేత్రంలో పురుహూతికా అమ్మవారు వెలిశారు. అమ్మవారి దర్శనానికి దేశ విదేశాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. ఇక దసరా ఉత్సవాలు ప్రారంభమైతే రోజూ అమ్మవారి ఆలయం కిటకిటలాడుతుంది. వేలాది మంది భవానీ భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు చేస్తుంటారు. అంతటి ప్రాధాన్యం కలిగిన పుష్కరిణి ఉత్సవాల సమయానికి కలుషితమై దుర్వాసన వెదజల్లుతున్నా ఆలయ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. శరన్నవరాత్ర ఉత్సవాలకు 15 రోజుల ముందు నుంచీ మహాలయ అమావాస్య వరకూ ప్రముఖ శైవ క్షేత్రమైన పాదగయ క్షేత్రంలో భారీగా పిండ ప్రదానాలు చేయడానికి భక్తులు తరలివచ్చి పూజల అనంతరం పిండాలను పాదగయ పుష్కరిణిలో కలిపారు. బియ్యం పిండి, అరటి పండ్లు తదితర వాటిని పుష్కరిణిలో వేయడంతో పూర్తిగా కలుషితమై దుర్వాసన వెదజల్లుతోంది. మహాలయ అమావాస్య వెళ్లిన మరునాడే శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాల్లో పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. కానీ మహాలయ పక్షం సందర్భంగా కలుషితమైన నీటిని తొలగించాలంటూ ఆలయ అధికారులు పుష్కరిణిలో నీటిని తొలగించనుండడంతో నవరాత్ర ఉత్సవాలకు పుణ్యస్నానాలు లేనట్టేనని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏటా ఇదే తంతు

ప్రతి ఏటా మహాలయ పక్షం వస్తుందని తెలుసు. దాని అనంతరం శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిసినా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారని భక్తులు విమర్శిస్తున్నారు. పిండ ప్రదానాల వల్ల పుష్కరిణి కలుషితమైందని, దానికి ప్రత్యామ్నాయంగా బోరు నీటితో జల్లు స్నానాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పుష్కరిణిలో చేస్తేనే పుణ్యస్నానం అవుతుందని, బోరు నీటిలో చేస్తే పుణ్యస్నానం ఎలా అవుతుందని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

ముందే తెలిసినా..

మహాలయ పక్షం రోజుల్లో 15 వేలకు పైగా పిండ ప్రదానాలు చేయగా, సుమారు టన్ను వరకూ పిండ ప్రదాన వస్తువులు పాదగయ పుష్కరిణిలో కలిపే అవకాశం ఉందంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో నీటిలో కలిసిన బియ్యం పిండి, ఇతర వస్తువులు త్వరగా కుళ్లి నీటిని కలుషితం చేస్తాయి. ఈ విషయం తెలిసినా ఆలయ అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతోనే ఏటా ఈ పరిస్థితి ఎదురవుతుందంటున్నారు. ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిసినా అధికారులు నీటిని శుద్ధి చేసే ఏర్పాట్లు చేయాలి. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడమేంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

జల్లు స్నానాలకు ఏర్పాట్లు

మహాలయ పక్షం సందర్భంగా భారీగా పిండ ప్రదానాలు చేయడంతో పాదగయ పుష్కరిణి కలుషితమైంది. దీంతో నీరు దుర్వాసన వెదజల్లుతూ స్నానాలకు వీలు లేకుండా తయారైంది. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా పాదగయ పుష్కరిణికి దగ్గరలో జల్లు స్నానాలు ఏర్పాటు చేశాం. మహాలయ అమావాస్య అనంతరం పాదగయ పుష్కరిణిలో నీరు తొలగించి కొత్త నీటితో నింపుతాం

–కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, ఈఓ, పిఠాపురం పాదగయ క్షేత్రం

బురద... వ్యథ

- ముత్తా ఫ్లై ఓవర్ బ్రిడ్జికి అనుసంధానంగా కానరాని రోడ్లు
- ప్రయాణికులకు తప్పని పాట్లు


ఫ్లై ఓవర్ నుంచి విద్యుత్ నగర్‌కు వెళ్లే రోడ్డు ఇలా..


ముత్తా ఫ్లై ఓవర్ నుంచి ఎల్‌బీ నగర్‌కు వెళ్లే రహదారి దుస్థితి

బోట్‌క్లబ్: ఆ దారిలో బురద వెతలు తప్పడం లేదు.. కనీసం నడిచేందుకు కూడా మార్గం ఉండడం లేదు.. నిత్యం ప్రయాణ ఇక్కట్లు తప్పడం లేదు.. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కాకినాడలోని ముత్తా ఫ్లైఓవర్ బ్రిడ్జికి అనుసంధానంగా ఉన్న రోడ్లు బురదమయంగా మారాయి. ఇటుగా ప్రయాణించే ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండడం, బ్రిడ్జికి అనుసంధానంగా రహదారి నిర్మించకపోవడంతో ఆ బురదలోంచే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య నివారణకు పదేళ్ల కిందట బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వాలు మారినా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. నిధులు మంజూరు చేయకపోవడం, బ్రిడ్జి నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందకపోవడం, భూసేకరణలో తీవ్ర జాప్యంతో ఇబ్బంది వచ్చింది. దీంతో పదేళ్లు పైనే బ్రిడ్జి నిర్మాణం సాగింది. ఈ ఇబ్బందులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణం సగంలోనే నిలిపివేసిన విషయాన్ని అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేయడంతో గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. బ్రిడ్జికి రెండువైపులా హైమాస్ట్ లైటింగ్ సైతం ఏర్పాటు చేశారు. కానీ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా అనుసంధానంగా ఉన్న పలు రహదారులు ఇంకా పూర్తి చేయలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్న ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. బ్రిడ్జికి రెండు వైపులా అనుసంధానంగా ఉన్న రహదారులు గ్రావెల్ వేసి వదిలేశారు. ప్రస్తుత వర్షాల కారణంగా మట్టి కొట్టుకుపోయి బురదమయంగా తయారైంది. వాహనదారులు ఈ రహదారుల్లో ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. కానీ భానుగుడి ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణిస్తే ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ముత్తా ఫ్లై ఓవర్‌పైనే ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికైనా ఈ రహదారి నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాదగయకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వారం రోజులుగా దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలోని పదో శక్తి పీఠమైన పురుహూతికా అమ్మవారి దివ్య సన్నిధిలో వేలాదిమంది భవానీ దీక్ష తీసుకుంటున్నారు. రోజూ 2 వేలకు పైగా భక్తులు భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

22 నుంచి దసరా వేడుకలు

సామర్లకోట: స్థానిక మాండవ్య నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకూ శరన్నవరాత్ర వేడుకలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి తెలిపారు. సోమవారం ఆలయంలోని అమ్మవారికి క్షీరాభిషేకం, కలశ స్థాపన, విశేష దశ సహస్రనామ పూజ, సాయంత్రం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. రోజూ భక్తుల గోత్ర నామాలతో పూజలు చేయించుకోవడానికి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.